ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 351 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 29 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## మయన్మార్‌ను వణికించిన
# భూకంపాలు



### థాయిలాండ్,చైనాలోనూ ప్రకంపనలు
### తీవ్రత కారణంగా పలు భవనాలు నేలమట్టం

బ్యాంకాక్,మార్చి 28 (ప్రభాత ఉదయం): మయన్మార్‌ను వరుస భూకంపాలు వణికించాయి. శుక్రవారం ఉదయం రిక్టరు స్కేలుపై 7.7, 6.4 తీవ్రతతో బలమైన ప్రకంపనలు నమోదయ్యాయి. సెంట్రల్ మయన్మార్ లోని మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. ఈ భూకంపం ధాటికి పలు భవనాలు ఊగిపోయాయి. పలుచోట్లు- ఎత్తయిన అంతస్తులు నేలకూలినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈ భూ ప్రకంపనలతో మయన్మార్‌లోని మండలేలో గల ఐకానిక్ అవా వంతెన కుప్పకూలిపోయింది.ఇరావడీ నదిలోకి వంతెన కూలిపోయిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఈ భూకంపం కారణంగా థాయ్‌లాండ్‌లో కూడా భూమి కంపించింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ లో 7.3 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. అంతేకాకుండా చైనాలోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. చైనాలోని నైరుతి యునాన్ ప్రావిన్స్‌లో భూమి కంపించినట్లు బీజింగ్ భూకంపం సంస్థ తెలిపింది. ఈ ప్రకంపనలు రిక్టరు స్కేలుపై 7.9 తీవ్రతతో నమోదైనట్లు వెల్లడించింది. భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల ..మిగతా 2లో

### భూకంపాలపై ప్రధాని మోడీ ఆరా
మయన్మార్, థాయిలాండ్ దేశాలకు బాసట 2



## సెంట్రల్ వర్సిటీ భూముల
# అమ్మకం అవివేకం

### ఇది ప్రకృతి విధ్వంసకర చర్య మాత్రమే
### ట్విట్టర్ వేదికగా కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకపూరిత నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం ఒక పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోనుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శిస్తూ ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్య చేశారు. కంచే-గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాదు, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఒక ప్రకటనపై కూడా ఆయన స్పందించారు. నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని తప్పుగా పేర్కొన్నారు. అయితే, విద్యార్థులు, అధ్యాపకుల సమాచారాన్ని ప్రకారం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 700కు పైగా పుష్ప వృక్ష జాతులు, 10 రకాల సస్తన ప్రాణులు, 15 రకాల సరీసృపాలు , 200కి పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాదు, అక్కడి శిలా నిర్మాణాలు ఏకంగా బిలియన్ సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నాయని వివరించారు. ఈ నిర్ణయాన్ని కెటిఆర్ తీవ్రంగా తప్పుబడుతూ, ..మిగతా 2లో

## కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు
# 2 శాతం డిఏ పెంపు
### కేబినేట్ ఆమోదిస్తూ తీర్మానం



న్యూఢిల్లీ,మార్చి 28 (ప్రభాత ఉదయం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి ..మిగతా 2లో




### బెట్టింగ్ యాప్స్‌కు నిర్మూలనకు..
# సజ్జనార్‌కు కీలక బాధ్యతలు

హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం): బెట్టింగ్ భూతాన్ని తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన కొందరు సెలబ్రిటీలను పోలీసులు విచారించారు. అయితే ఇలా చేయడం ద్వారా బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిర్మూలించ లేమని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ..మిగతా 2లో

## విష్ణుప్రియకు
# కోర్టులో చుక్కెదురు



హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం): బెట్టింగ్ యాప్‌ల కేసులో నటి విష్ణుప్రియకు తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. మియాపూర్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కొట్టేయాలంటూ ఆమె హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం తెలంగాణ హైకోర్టు విచారించింది. ఎఫ్ఐఆర్ కొట్టేసేందుకు.. అలాగే ఈ దర్యాప్తుపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించించింది. అంతేకాకుండా.. ఈ కేసులో ..మిగతా 2లో

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో
# మరో మృతదేహం గుర్తింపు



నాగర్ కర్నూల్,మార్చి 28 (ప్రభాత ఉదయం): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు సొరంగంలో కూలిన మట్టిలో చిక్కుకుపోయి నేటికీ ఐదు వారాలు గడిచిపోయింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్, క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు దాదాపు 600 మంది.. మూడు స్విఫ్ట్‌ల్లో నిరంతరాయంగా సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. సొరంగంలో కార్మికులపై కూలిన మట్టిని తొలగించేందుకు రెస్క్యూ టీంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉబికి వస్తున్న ఊట నీటితో సొరంగమంతా బురదమయంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. కార్మికుల మృతదేహాలను ..మిగతా 2లో

# మళ్లీ పెరగనున్న మెట్రో చార్జీలు
### కేంద్రం అనుమతి కోరేందుకు ప్రయత్నాలు




హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం): మెట్రోకు ఈ మధ్యకాలంలో నష్టాలు వస్తుండటంతో హైదరాబాద్ మెట్రో రైలు టికెట్ రేట్లు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) సంస్థ అధికారులు ప్రయత్నిస్తున్నారు. రోజుకు కోటిన్నర రూపాయల నష్టం వస్తోందని, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ఇప్పటికీ వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఎల్అండ్‌టీ సంస్థ చెబుతోంది. అయితే ప్రయాణికులపై అదనపు భారం వేయొద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ధరల పెంపునకు సుముఖంగా లేదని తెలుస్తోంది. నగరంలో మొదటిదశ ప్రాజెక్టును ఎల్అండ్‌టీ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ)లో 2012లో రూ.14,132 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 2017 నవంబరులో పూర్తిచేశారు. మూడు కారిడార్ల పరిధిలో ప్రయాణించే వారి సంఖ్య రోజూ ..మిగతా 2లో




## కాంగ్రెస్ పాలనలో
# అన్ని వర్గాల్లో అశాంతి
### అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్
### పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పాలనలో ప్రజలు అశాంతిగా ఉన్నారని, ఈ పాలన ఎప్పుడు ఆగిపోతుందోనని ఎదురు చూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శాసన ..మిగతా 2లో



## రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు సన్మానం

కొత్తకోట, మార్చి 28(ప్రధాన ఉదయం) కొత్తకోట మండలంలో ని రామకృష్ణాపురం గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులను స్థానిక నాయకులు శివరాములు పెంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బి శివరాములు యాదవ్, మున్నూరు వెంకటన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగరాజు, ఉప్పరి నరసింహ, బండారి నరసింహ, మధుగం మొగులన్న తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు

మొదటి పేజీ తరువాయి...

గుర్తించేందుకు అడ్డుగా ఉన్న బోరింగ్ మిషన్‌ను కటింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా శకలాలను బయటకు పంపిస్తున్నారు. ఇటీవల లభ్యమైన మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో మరో డెడ్ బాడీ ఉన్నట్లు గుర్తించిన రెస్క్యూ బృందాలు బయటకు తీసేందుకు శ్రమిస్తున్నాయి. కార్మికులకుపై పడిన బురద మట్టి, సున్నం మట్టి బిగుసుకుపోవడంతో మట్టిని తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కేడవార్ డాగ్స్‌ను తెప్పించి మరోసారి సొరంగంలో పరిశీలించినా దుర్వాసన వల్ల మృతదేహాలను గుర్తించకపోయినట్టు తెలుస్తుంది. శుక్రవారం ఏడున్నర గంటల ప్రాంతంలో రెస్క్యూ బృందాలు మరోమారు టన్నెల్లోకి సహాయక చర్యలు చేపట్టేందుకు బయలుదేరాయి. రెస్క్యూ బృందాలు మధ్యాహ్నం తర్వాత బయటకు వచ్చే అవకాశం ఉండడంతో మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో ఉన్న మరో వ్యక్తి డెడ్ బాడీ వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం శివశంకర్ అనే ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. గత మూడు రోజులుగా ఆయన సమక్షంలోనే రెస్క్యూ బృందాలు సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి.

## కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు 2 శాతం డీఏ పెంపు

మొదటి పేజీ తరువాయి...

చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48లక్షల మంది ఉద్యోగులు, 67లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జూలైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జూలై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటు-ంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

## సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకం అవివేకం

మొదటి పేజీ తరువాయి...



ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఓ విపరీతమైన నిర్ణయం. ఒక వైపు ప్రకృతి రక్షణ అంటూ మాట్లాడుతూ, మరోవైపు ప్రకృతి నాశనానికి పాల్పడటం ఆశ్చర్యకరం. ఈ భూమిని వాణిజ్య కేంద్రంగా మార్చేందుకు, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే చర్య అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను!అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## బెట్టింగ్ యాప్స్‌కు నిర్మూలనకు.. సజ్జనార్‌కు కీలక బాధ్యతలు

మొదటి పేజీ తరువాయి...



స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్)ను ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. ఈ క్రమంలో ఆర్టిసి ఎండి సజ్జనార్‌కు కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే టాక్ వినిపిస్తోంది. సిట్ గురించి అసెంబ్లీలో ప్రకటన చేసే ముందు సిఎం ఓ సమావేశం నిర్వహించారు. శాసనసభలోని ఆయన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిజిపి జితేందర్, డిజి శివధర్ రెడ్డి, హైదరాబాద్ కమీషనర్ సివి ఆనంద్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్‌తో పాటు సజ్జనార్ కూడా పాల్గొన్నారు. దీంతో ఈ సిట్ ఏర్పాటులో సజ్జనార్‌కి కూడా కీలక బాధ్యతలు అప్పగిస్తారనే వార్తలు చెక్కర్లు కొడుతున్నాయి.

# మయన్మార్‌ను వణికించిన భూకంపాలు

మొదటి పేజీ తరువాయి...

నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంపం తీవ్రత భారీ స్థాయిలోనే ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉంది. అయితే, అందుకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. మయన్మార్‌లో 12 నిమిషాల వ్యవధిలో రెండుసార్లు భారీ భూంకంపాలు సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.7గా నమోదైంది. ఈ భూకంపం కారణంగా పొరుగున ఉన్న థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో రెండుసార్లు తీవ్ర ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రకంపనల కారణంగా పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బ్యాంకాక్‌లో ప్రకంపనల తీవ్రత 6.4, 7.3గా నమోదైంది. సెంట్రల్ మయన్మార్ లోని మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు- యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. పలు భవనాల్లో అలారమ్ మోగడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. ప్రకంపనల ధాటికి అనేక భవనాలు ఊగిపోయాయి. అనేక భవంతులు నేలమట్టమయ్యాయి. ఓ భారీ భవంతి పైఅంతస్తులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోని నీరు కిందకు పడిపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కూలిన దృశ్యాలు బయటికొచ్చాయి. ప్రమాదం సమయంలో ఆ భవనంలో ఎవరైనా కార్మికులు ఉన్నారా? శిథిలాల కింద చిక్కుకుపోయారా? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు. అయితే, 43 మంది కార్మికులు చిక్కుకున్నట్లు పలు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో థాయ్‌లాండ్‌లో ప్రధాని షినవత్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మరోవైపు, మయన్మార్‌లోనూ అనేక భవనాలు ధ్వంసమైనట్లు- తెలిసింది. పలు రహదారులపై చీలికలు ఏర్పడ్డాయి. అయితే.. భూకంపం కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ భూకంప ప్రభావం ఆగ్నేయాసియా దేశాలపైనా కన్పించింది. భారత్‌లోని కోల్‌కతా, ఇంఫాల్, మేఘాలయలో స్వల్పంగా ప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. మేఘాలయ ఈస్ట్‌గారో హిల్స్‌లో 4 తీవ్రతతో ప్రకంపనలు చోటు-చేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లోనూ 7.3 తీవ్రతతో భూమి కంపించినట్లు తెలుస్తోంది.



## భూకంపాలనూ ప్రధాని మోడీ ఆరా

### మయన్మార్, థాయిలాండ్ దేశాలకు బాసట

న్యూఢిల్లీ, మార్చి 28 (ప్రభాత ఉదయం): భారీ భూప్రకంపనలతో బ్యాంకాక్, మయన్మార్ వణికిపోయాయి. రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో ప్రకంపనలు రావడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. భయంతో జనాలు బయటకు పరుగులు తీశారు. పెద్ద పెద్ద బిల్డింగ్‌లు కూలిపోయాయి. అయితే ఈ ఘటనలో భారీగానే ప్రాణనష్టం జరిగి ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక థాయిలాండ్ ప్రధాని అత్యవసర పరిస్థితిని విధించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు రెస్క్యూ సిబ్బంది రంగంలోకి దిగి సహా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే శుక్రవారం చోటుచేసుకున్న భూప్రకంపనలపై ప్రధాని మోడీ ఆరా తీశారు. మయన్మార్, థాయిలాండ్ భూకంపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మయన్మార్, థాయిలాండ్ ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని ప్రధాని మోడీ విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరారు. సాధ్యమైన అన్ని సహాయాలను అందించడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు- తెలిపారు. ఇదిలా ఉంటే భారత్‌లోనూ భూప్రకంపనలు చోటు-చేసుకున్నాయి. రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదైనట్లు-గా తెలుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ సహా కోల్‌కతా, రాంచీ, త్రిపుర, అస్సాం, పాట్నాలో భూప్రకంపనలు సంభవించాయి. దీంతో భయంతో విద్యార్థులు, అధ్యాపకులు క్లాస్ రూమ్‌లోంచి బయటకు వచ్చేశారు. అలాగే అధికారులు కూడా కార్యాలయాల్లోంచి ఇళ్లకు వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మళ్లీ పెరగనున్న మెట్రో చార్జీలు

మొదటి పేజీ తరువాయి...

5.10 లక్షలకు చేరింది. కరోనాకు ముందు రోజుకు రూ.80 లక్షలకు పైగా ఎల్ అండ్ టీ ఆదాయం సమకూర్చుకుంది. అయితే, 2020లో కరోనా లాక్‌డౌన్‌తో మెట్రో కుదేలైంది. 2022 నుంచి క్రమంగా కోలుకున్నా నష్టాల ఊబి నుంచి బయటపడలేదని చెబుతోంది. మెట్రో నిర్వహణలో రోజుకు సుమారు రూ.కోటిన్నర వరకు నష్టం వస్తున్నట్లు ఎల్ అండ్ టీ అధికారులు తరచూ చెబుతున్నారు. ఆశించినవిధంగా ప్రయాణికుల సంఖ్య రోజుకు 6 లక్షలకు పెరగకపోవడం, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో నష్టాలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. టికెట్ రేట్ల సవరణ విషయంపై హెచ్ఎంఆర్ సంస్థ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో కమిటీని నియమించింది. ఆ కమిటీ ప్రజాభిప్రాయాన్ని సేకరించి నివేదిక సమర్పించింది. అదే సమయంలో 2023 జనవరి నుంచి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రావడంతో టికెట్ చార్జీల విషయం మరుగునపడింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు హెచ్ఎంఆర్, ఎల్అండ్‌టీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మెట్రోకు మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గిందని, కనీసం టికెట్ చార్జీలు పెంచుకునే అవకాశం కల్పిస్తే కొంతైనా నష్టాలను పూడ్చుకుంటామని ఎల్అండ్‌టీ కోరుతోంది. అయితే మెట్రో రెండో దశ నిర్మాణంపై దృష్టి సారించిన సర్కారు ఇప్పుడు కేంద్రానికి ఈ విషయం తెలియజేస్తే... అసలు లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తోంది. అంతేకాకుండా కాలుష్యరహితంగా నడిచే మెట్రో రైళ్లలో టికెట్ ధరలు అందుబాటులో ఉండాలని, పెంచితే ప్రయాణికుల సంఖ్య పడిపోతుందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటోంది.

## అర్హులందరికీ కార్డులు.. సన్నబియ్యం

### మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



నల్లగొండ,మార్చి 28 (ప్రభాత ఉదయం): అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్న బియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని అన్నారు. ఈ క్రమంలో ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం ఆందనుంది. రేషన్ బియ్యాన్ని చాలామంది ఉపయోగించుకోవడం లేదు. దొడ్డు బియ్యం తినకుండా కొందరు బ్లాక్‌లో అమ్ముతున్నారు. అందుకే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ.10,665 కోట్లు- ఖర్చు చేస్తున్నాయని ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే కార్డుకు అర్హుల జాబితా సిద్ధం అయ్యిందన్నారు. సిఎం రేవంత్ చేతుల మీదుగా పథకం ప్రారంభం అవుతుందని అన్నారు.

### పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి

## జాతీయ హెూదా ఇవ్వలేం

### తేల్చిచెప్పిన కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం): పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రజల్‌శక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హెూదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

మొదటి పేజీ తరువాయి...

మండలిలో ఇవాళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. 'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు. సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామని, అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని కవిత చెప్పారు. ఈ మండలి సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచి పోతాయని, ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని తెలిపారు. ఆ బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఫలితం ఎంతో ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుష పదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలు ఆయన చరిత్రలో మరకగా ఉండిపోతాయని అన్నారు.

## విష్ణుప్రియకు కోర్టులో చుక్కెదురు

మొదటి పేజీ తరువాయి...


పోలీసులకు సహకరించాలని విష్ణు ప్రియను హైకోర్టు ఆదేశించింది. అలాగే చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్‌లపై ప్రచారం చేసిన పలువురు నటులు, ఇన్‌ఫ్లూయన్సర్లపై మియాపూర్‌తోపాటు పంజాగుట్ట పోలీసులు పలు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా పలువురు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. బెయిల్ పొందేందుకు పిటిషన్లు దాఖలు చేస్తున్నారు.

# రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసోజు యాదగిరి

బుద్వేల్, మార్చి28(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కాసోజు యాదగిరి ఎన్నికైనారు. గురువారం ఉప్పర్ పల్లి లోని రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ లో జరిగిన ఎన్నికల ఫలితాలు రాత్రి 9గంటలకు విడుదల చేశారు. ఉపాధ్యక్షులుగా మామిడి మదుసూదన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శిగా జి.బందయ్య, సంయుక్త కార్యదర్శిగా కె. జ్ఞానేశ్వర చారి, కోశాధికారిగా వి.లక్ష్మయ్య, మహిళ కార్యదర్శిగా ఆర్ అనిత, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శిగా కిరణ్ కుమార్, లైబ్రేరియన్ గా అమృత్ రెడ్డి , కార్యవర్గ సభ్యులుగా ఎస్. బాగేందర్ సింగ్, తమ్మళి యశ్వంత్, డి.రాజు, అర్. రమేశ్, మహేందర్ రెడ్డి ఎన్నికైనారు.



రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు



# నేడు విద్యుత్తు లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్/బండ్లగూడ, మార్చి 28(ప్రభాత ఉదయం) హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి 2:30 వరకు ఖాళీ మందిర్ విద్యుత్తు లీడర్ పరిధిలో సంజయ్ గాంధీనగర్, భవాని కాలనీ, బైరాగి గూడ, శివ సాయి నగర్, సుబ్రహ్మణ్య కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధం గూడ, పెద్ద మంగళారం విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన హీర కాలనీ, సన్ సిటీ ప్రధాన రహదారి, సి వై ఆర్ కన్వెన్షన్, భాగ్యనగర్ ఓల్డ్ కాలనీ, కపిల్ నగర్, కేకే నగర్ విద్యుత్ పీటర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి మూడున్నర వరకు కేకే వన్ టు, సాయి బాలాజీ నగర్, ఫీల్ గుడ్ హోమ్, శ్రీనివాస నగర్ కాలనీ, శ్రీనివాస నగర్ గుట్ట, కేకే -4, కిష్టారెడ్డి కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, గంధం కూడా విలేజ్, డిస్కవరీ స్కూల్, మార్వెల్ హోం, శివగంగ కాలనీ"హైదర్ షా కోర్టు విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుండి మూడున్నర వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్ నగర్, తిరుమల గార్డెన్, రాధా రియాల్టర్ ఫేస్ టు, పావని హార్మోని విల్లా, బచ్పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ ప్రధాన రహదారి, సన్ సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం నాలుగు గంటల నుండి నాలుగున్నర వరకు హిమాయత్ సాగర్, గంధం గూడ, వెస్ట్ అండ్ కాలనీ, శాంతినగర్, లక్ష్మీ నగర్, హైదర్ షాకోట్ విలేజ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు.

**కాటేదాన్ లో...**

మైలార్దేవ్పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం రెండున్నర నుండి మూడు గంటల వరకు దుర్గా నగర్, టీఎన్జీవోస్ కాలనీ, దుర్గా హిల్స్, అయ్యప్ప స్వామి టెంపుల్, మహిళా పల్లి కల్లు కాంపౌండ్, శాంతినగర్, గణేష్ నగర్, స్వప్న థియేటర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు.

**రాజేంద్రనగర్ సెక్షన్ లో...**

రాజేంద్రనగర్ శిక్షణ పరిధిలో గల ఉప్పరపల్లి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం నాలుగు నుండి నాలుగున్నర వరకు హైదర్గూడ, ఉప్పరపల్లి, ఎర్రబోడ, బాంబే కాలనీ, నాయుడు కాలనీ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం రెండున్నర నుండి మూడు గంటల వరకు ఫోర్ టు వ్యూ కాలనీ, పరమారెడ్డి హిల్స్, అశోక్ విహార కాలనీ, జన చైతన్య ఫేస్ 1,2, గోల్డెన్ హైట్స్ కాలనీ అందాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

**కిస్మత్ పూర్ లో...**

కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం రెండున్నర నుండి మూడు గంటల వరకు రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శ్రీ సాయి కాలనీ ,ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2, సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, కీర్తి విల్లాస్, సాయంత్రం నాలుగు నుండి నాలుగున్నర వరకు ఎల్వీ ప్రసాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శ్రీ బాలాజీ ఎంక్లేవ్, రాజా క్షేత్ర, గిరిదారి, దర్గా కలిస్తాన్, ఎల్వీ ప్రసాద్, కీర్తి విల్లా, నమః, మ్యాప్ హార్ కన్స్ట్రక్షన్ 80 యార్డ్స్, 60 గజాలు, మధ్యాహ్నం రెండు నుండి రెండున్నర వరకు డాన్ బెస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన మ్యూచువల్ కాలనీ, వినాయక నగర్, డిడి కాలనీ, కాళీ మందిర్, ఎన్ఎఫ్సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్, సంధ్యా నగర్, మాచంపల్లి ఎంక్లేవ్, జి ఆర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం సరఫరాలో అంతరాయం ఉంటుందని కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజు తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.




# గిరిజన సమస్యలపై మాట్లాడిన కూనంనేని సాంబశివరావుకి అభినందనలు

### గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివప్రచండ

ఎల్బీనగర్, మార్చి28(ప్రభాతవుదయం) ఈనెల 27వ తారీఖున నిండు శాసనసభలో రాష్ట్రంలో అధికంగా మాట్లాడే గోర్ బోలి భాషను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం హర్షించదగ్గ విషయమని దేశంలో రాష్ట్రంలో అట్టడుగున ఉన్నటువంటి ఈ జాతుల పట్ల గిరిజనుల అభివృద్ధి వైపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచన చేసి గోర్ బోలి భాషను రాజ్యాంగంలో ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గిరిజన సమస్యలపై మాట్లాడిన సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కి అభినందనలు తెలియజేశారు.. రాష్ట్ర ప్రభుత్వం పంపించిన తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి రాజ్యాంగంలో ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చి గోర్ బోలి భాషను రాజ్యాంగబద్ధంగా గుర్తించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ , గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివ ప్రచండ డిమాండ్ చేశారు.


బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతు చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమ వాల్పోస్టర్ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు భిక్షపతి, దశరత్, రమేశ్, మాగని క్రిష్ణ, సంతోష్ గౌడ్, కవిత, సురేఖ, సందీప్, రజనీకాంత్ తదితరులు

బుద్వేల్, ప్రభాత ఉదయం

# టీబీ నిర్మూలనలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, మార్చి28(ప్రభాత ఉదయం): క్షయ వ్యాధి పూర్తిగా నయం చేయగలిగే వ్యాధి కానీ సరైన అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం కారణంగా ఇది ఇంకా సమస్యగా మారిందని రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. వరల్డ్ టీబీ డే ను పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో హెల్త్ సూపర్వైజర్ రహీం ఆధ్వర్యంలో శు క్రవారం మైలార్దేవుపల్లిలోని ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ నివాసంలో ఐఈసీ ప్రచార సామాగ్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ ముక్త్ భారత్ లక్ష్యాన్ని ము ందుం చుకుని ఉచిత పరీక్షలు, మందులు, పోషకాహార మద్దతు అందిస్తున్నాయన్నారు. ప్రజలం దరు క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయిం చుకోవాలన్నారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ రహీమ్ మాట్లాడుతూ, టీబీ నిర్మూలలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా మైక్రోస్కోపీ పరీక్షలు, ఎక్స్రే స్కానిం గ్. రక్త పరీక్షలు అందిస్తున్నామన్నారు. టీబీ రోగులకు సరైన వైద్య సేవలు, పోషకాహారం అందిం కేందుకు కేంద్ర ప్రభుత్వం నిక్షేపం క్రింద ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో టీబీ ఆలర్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కిరణ్, నరేశ్ కుమార్, మదుబాబు. పద్మలత తదితరులు పాల్గొన్నారు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న సదాలక్ష్మీ తదితరులు

# మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళలకు ఇఫ్తార్

బుద్వేల్, మార్చి28(ప్రభాత ఉదయం): మహిళా కాం గ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మీ ఆధ్వర్యంలో శు క్రవారం మైలార్వపల్లి లో మహిళలకు ఇఫ్తార్ విందు ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదాలక్ష్మీ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మైలార్దే వుపల్లిలో మహిళా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. రంజాన్ మాసంలో మత సామరస్యానికి ప్రతీకగా ఈ ఇఫ్తార్ మిందులు దోహదపడతాయన్నారు. ముస్లిం సోదరులకు రం జాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి



బాబా నగర్లో అవగాహన ర్యాలీ

బుద్వేల్, మార్చి28 (ప్రభాత ఉదయం) వేసవి లో నీటి కష్టాలు రాకుండ మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని పుష్పగిరి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వాహకురాలు బి. పుష్పలీల అన్నారు. రాజేంద్రనగర్ 16వ డివిజన్ జలమండలి అధికారుల సహకారంతో శుక్రవారం బాబానగర్ లో నీటి పొదుపు పై విద్యార్థులు, స్థానిక మహిళలతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. రక్షిత మంచినీటిని ఎంతో దూరం నుంచి చాల ఖర్చు చేసి తీసుకువస్తున్నారని, ఆ నీటిని త్రాగడానికే ఉ పయోగించాలన్నారు. బోరు నీటి ని అవసరాల కోసం వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యురాలు ఖమరున్నీసా, షేక్ అన్వర్, పుష్పగిరి స్వచ్ఛంద సంస్థ సభ్యులు హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.


ఫోర్ మెన్గా ప్రమోషన్ అందుకుంటున్న యాదయ్య

# రాజేంద్రనగర్ డివిజన్లో ఫోర్మెన్గా యాదయ్య

బుద్వేల్, మార్చి28(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ లో సీనియర్ లైన్ ఇన్స్ పెక్టర్ గా పనిచేస్తున్న యాదయ్య ఫోర్మెన్ గా ప్రమోషన్ పొందారు. శుక్రవారం సూపరిం టెండెంట్ ఇంజనీర్ వెంకన్న చేతుల మీదుగా యాదయ్య ప్రమోషన్ పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు చంద్రమౌళి, జేఓ శ్రీనివాస్, వెం కటస్వామీ, సురేశ్, రాజు, రమాదేవి, క్రిష్ణ, మహేశ్, సంపత్, నర్సింహ్మా, వెంకటేశ్, అర్జున్, చం ద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

# మహనీయుల జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

బుద్వేల్, మార్చి28(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లో ఏప్రిల్ లో నిర్వహించనున్న బాబు జగ్జీవన్ రాం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన వాల్పోస్టర్ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన నివాసంలో ఆవిష్కరించారు. మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. తాను కూడా ఉత్సవాలలో పాల్గొంటానన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ ను కలసిన వారిలో జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేశ్, కోశాధికారి మంగళారం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక



## తొండుపల్లి జాతీయ రహదారిపై పరమేష్ గౌడ్ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రారంభించిన సీఐ నరేందర్ రెడ్డి

శంషాబాద్ , మార్చ్ 28( ప్రభాత ఉదయం) హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు శంషాబాద్ ఇన్స్పెక్టర్ కట్ట నరేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకుడు కొండ పరమేష్ గౌడ్ సొంత డబ్బులతో వీటిని ఏర్పాటు చేశారు. కెమెరాలను ఏర్పాటు చేసిన సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నేరాలను అరికట్టడంలో నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయని అన్నారు. కాలనీలలో బస్తీలలో రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని ప్రజలను ఆయన కోరారు. తొండపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు వచ్చిన పరమేష్ గౌడ్ ను ఆయన అభినందించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన సూచించారు. సీసీ కెమెరాల దాత కొండ పరమేష్ గౌడ్ మాట్లాడుతూ సీఐ నరేందర్ రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు నేరస్తుల సంచారాన్ని కనిపెట్టడంలో సీసీ కెమెరాలు ఎంతో కీలకపాత్ర వహిస్తాయని ఆయన తెలిపారు. నేరాల నారికట్టడంలో పోలీసులకు సహకరించడానికి తానేప్పుడు ముందు ఉంటానని పరమేష్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెదిరిపాటి సుధాకర్ గౌడ్. దొడ్డ పెంటయ్య. కదిరిపాటి శేఖర్ గౌడ్. రేనట్ల అశోక్ గౌడ్. పోలేపల్లి సునీల్ గౌడ్. కోడూరు సుఖేందర్. కొండా సుదర్శన్ గౌడ్. సిద్ధులు నర్సింగ్. దామోదర్ గౌడ్.( చంటి) రాజు తదితరులు పాల్గొన్నారు.



## చిన్న గోల్కొండ సహకార సంఘం సర్వసభ్య సమావేశం

శంషాబాద్,మార్చ్ 28( ప్రభాత ఉదయం) చిన్న గోల్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బొమ్మ దవనకర్ గౌడ్ అధ్యక్షతనలో శుక్రవారం మహాజనసభ నిర్వహించారు. ప్యాక్స్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 11మంది రైతులకు 10 లక్షల సన్నకార రుణాలు చెక్కులను అందించడం జరిగింది, అదేవిధంగా సరైన పత్రాలు లేని ఐదు మంది రైతులను ఓటు జాబితా నుండి తొలగించడం జరిగినది, వివిధ కారణాలతో మృతి చెందిన 191 మంది రైతులను ఓటరు జాబితా నుండి తొలగించాలని నిర్ణయించారు . బొమ్మ రావణాకర్ గౌడ్ మాట్లాడుతూ సంఘం అందించే సేవలను ప్రతి రైతు సంఘం ఇచ్చే ప్రతి రుణాన్ని తీసుకోవాలని ప్రతి రైతు బాగుపడాలని సూచించారు. బంగారంపై రుణాలు ఇది వరకు 40000. 10 గ్రాములకు గాను 50 వేల రూపాయలు 10 గ్రాములకు ఇచ్చేంతకు తీర్మానం తీర్మానం చేశారు , ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మ%శీ%చర్ల మోహన్ రావు ,పాలకవర్గ సభ్యులు ఏనుగు దేవేందర్ రెడ్డి, బాల్య నాయక్, ప్రశాంత్ రెడ్డి ,విజయలక్ష్మి, రూప సీఈవో యాదయ్య, మధుమతి, సురేష్, జగపతి, వివిధ గ్రామాల రైతులు బాల్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, సురేష్ కుమార్, కుమ్మరి నరసింహ, నారాయణరెడ్డి. వట్టెల మల్లేష్ యాదవ్. నవారు అనంతరెడ్డి. యాదిరెడ్డి. ప్రభాకర్. పాండురంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎండుతున్న పంటలు

### ఎండిపోయిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి28(ప్రభాత ఉదయం)ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతుల పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని, సాగు భూములు నెర్రెలు వారుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బాసు హన్మంతునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గద్వాల మండలం కొత్తపల్లి గ్రామంలో సాగు నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాలను బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాసు హన్మంతునాయుడు, నాయకులు ద్విచక్ర వాహనాల పై వెళ్లి పరిశీలించారు. వరి పొలానికి అప్పు తీసుకొచ్చి పెట్టుబడి సాగు చేస్తున్నామని, నీళ్ళు లేక పంటలు ఎండిపోతున్నాయని ఈ సందర్భంగా రైతులు బోరున విలపించారు. పంటలు ఎండిపోవడంతో తమ కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాసు హన్మంతునాయుడు మాట్లాడుతూ ఈ ప్రజా పాలనలో రాష్ట్రంలో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతున్న కనీసం పట్టించుకునే నాధుడే లేడన్నారు. ఈ చేతగాని ప్రభుత్వంలో రైతన్నల జీవితం అస్తవ్యస్తమైందని అన్నారు. కేసీఆర్ ఉన్నపుడు మండుటెండల్లో కూడా సాగుకు నీరందించారన్నారు. మళ్లీ కేసీఆర్ వస్తేనే రైతు జీవితాలు బాగుపడతాయని రైతన్నలు ఆవేదనతో అంటున్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగిలాయని,పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క రోజు పంటలు ఎండిపోయిన సందర్భాలు లేవని అన్నారు. ప్రభుత్వానికి పాలనపై అవగాహన లేక ప్రాజెక్టుల ద్వారా నీళ్లు అందించలేకపోతుందని మండిపడ్డారు. వెంటనే జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఎస్ఇ అధికారులు స్పందించి ఎండిపోయిన పొలాలకు జూరాల కుడి కాలువ ద్వారా నీళ్లు వెంటనే విడుదల చేసి కొన ఊపిరితో ఉన్న పొలాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోనేష్,డి.శేఖర్ నాయుడు,వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీ రాములు,తిరుమలేష్, వెంకటేశ్వర్ రెడ్డి, ముని మౌర్య,చిన్న, వెంకటేశ్వర్ రెడ్డి,వెంకటేష్, నరసింహులు, కె.ఈశ్వరన్న,బెల్లం రమణ, ఆంజనేయులు, అనిల్, హనుమన్న, మహిళా రైతులు, చెన్నమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ కుట్ర

### కొత్త రేషన్ కార్డ్‌లు ఇవ్వకుండానే సన్న బియ్యం పంపిణీ ఎలా?..

### జిల్లా బిజెపి అధ్యక్షులు రామాంజనేయులు

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి28(ప్రభాత ఉదయం)ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు టి.రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గద్వాలలోని డికె. బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో బీపీఎల్ పేరిట రేషన్ కార్డ్ లు ఇవ్వకుండా జాప్యం చేసి బీదబడుగులను మోసం చేసిందని, అదే బీఆర్ఎస్ చేసిన తప్పులే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తూ కొత్త రేషన్ కార్డ్ లు మంజూరు చేయకుండా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అయిన ప్రజాపాలన పేరిట రేషన్ కార్డుల ధరఖాస్తులు తీసుకొని ఎందుకు జాప్యం చేస్తున్నారో అని ప్రజలకు వివరించాలన్నారు. కొత్త రేషన్ కార్డులు అంటూ వార్డుల వారిగా అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ మళ్ళీ దరఖాస్తులు చేసుకోవాలి అని చెప్తూ బడుగులను మోసం చేస్తున్నారన్నారు. మీ సేవ సెంటర్ లో కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవొచ్చు అంటూ చెప్పిన ప్రభుత్వం దరఖాస్తు ల పేరిట మాత్రమే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు లబ్దిదారులు పొందాలంటే రేషన్ కార్డు తప్పని సరి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలుసు అని, రేషన్ కార్డులు మంజూరు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం



వహిస్తోందన్నారు. 2023 డిసెంబర్ నుంచి మొదలుకొని 2025 జనవరి దాకా రేషన్ కార్డు దరఖాస్తుల వరకే పరిమితం చేసి బలహీన వర్గాల ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఉగాది నుంచి రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ చేస్తామంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. ఉగాది పండుగ లోపు కొత్త రేషన్ కార్డ్ లు పంపిణి చేసి వచ్చే ఏప్రిల్ లో కొత్త వారికి, పాత వారికి అందరికి సన్న బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ, కెకె రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవా దాస్, ఐటీ సెల్ కన్వీనర్ చిత్తారి కిరణ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు అనిల్,బిజెపి నాయకులు ఢిల్లీవాల క్రిష్ణ,డబ్బిలేటి నరసింహ, మోహన్,కోట్ల వీరేశ్ ,నరసింహ శెట్టి, వాసు,మండల అధ్యక్షులు శ్రీను తదితరులు ఉన్నారు.

# ఏటా నీళ్ల గోసేనా?





### పాలకులు మారినా పట్టింపు ఏదీ?

### ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా

### అధికారి హామీతో ధర్నా విరమణ

### సమస్యలు పరిష్కరించకుంటే రిలే నిరాహార దీక్షలు

### సంకే రవి సీపీఎం జిల్లా కార్యదర్శి

చెన్నూర్, మార్చి 28. (ప్రభాత ఉదయం): చెన్నూర్ మండలం బావురావుపేట ఆదివాసీలు సం.రాల తరబడి మంచి నీటి సమస్యతో అల్లాడిపోతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన ప్రజలతో ఓట్లు వేయించుకుంటున్నరే, తప్ప ప్రజల బాధలను పట్టించుకోవడం లేదు. 80 కుటుంబాలు సుమారు 400 జనాభా గల ఆదివాసీలు సమస్యల సుడిగుండంలో జీవిస్తున్నారు. ప్రతి ఎండాకాలంలో 2 కిలో మీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకొని కుటుంబ అవసరాలు తీర్చుకోవడం జరుగుతుంది. మురికి కాలువలు కూడ నిర్మానం చెయ్యలేదు. కొన్నిచోట్ల రోడ్డు వేయాలి. గత వారం రోజులుగా గ్రామంలో సర్వేచెయ్యగ ప్రజలు తమ బాధలను సీపీఎం నాయకుల దృష్టికి తీసుకురాడంతో ఈ రోజున ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోడెంకి చందు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, శ్యమల ఉమారాణి సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు, సిపిఎం నాయకులు సిడం సమ్మక్క, బుధక్క, సరిత, నగేష్, రమాదేవి, యామిని, శంకరక్క, కరిపెత చిన్నక్క, బావురావుపేట గ్రామస్తులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి నాలుగవ కరాటే ఇండియా పోటీలు

హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 28(ప్రభాత ఉదయం) నాల్గవ జాతీయస్థాయి కరాటే ఇండియా ఆర్గనైజేషన్ పోటీలు ప్రారంభమయ్యాయి . శుక్రవారంహైదరాబాద్ మహానగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన నాలుగవ జాతీయ స్థాయి జియో కరాటే ఛాంపియన్షిప్ పోటీలు జరిగాయి .ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సాధ్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, తెలంగాణ స్పీకర్ ప్రసాద్ కుమార్ పాల్గొని కరాటే డ్రెస్ వేసుకొని ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు చివరి రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.



## దోపిడీ దొంగల బీభత్సం పెట్రోల్ బంకుల్లో చోరీ

### గంటల వ్యవధిలో రెండు బంకుల్లో చోరీ

### నగదు అపహరణ, హార్డ్ డిస్క్ మాయం

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి28(ప్రభాత ఉదయం) జోగుళాంబ గద్వాల జిల్లాలో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. మల్దకల్ మండలం అమరవాయిలో గల ఇండియన్ పెట్రోల్ బంక్, అయిజ మండల కేంద్రంలోని హెచ్ పి పెట్రోల్ బంకుల్లో చోరీ చేశారు. శుక్రవారం తెలవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు మల్దకల్ మండలం అమరవాయి పెట్రోల్ బంకులో మేనేజర్ రూమ్ అద్దాలు పగులగొట్టి సిబ్బందిని బెదిరించి అందులో ఉన్న సుమారు రూలక్ష వరకు నగదు తో పాటు హార్డ్ డిస్క్ ను ఎత్తుకెళ్లారు. అలాగే అయిజ మండల కేంద్రంలో గల హెచ్ పి పెట్రోల్ బంకు స్టాప్ రూమ్ పై కత్తులు, రాళ్లతో దాడి చేసి కౌంటర్ లో ఉన్న లక్ష రూపాయాల నగదు, సిసి కెమెరాల హార్డ్ డిస్కును ఎత్తుకెళ్లారు. మరోవైపు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్ డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. అనంతరం తేరుకున్న సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాలకు చేరుకున్న ఆయా పరిధిలోని పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సిబ్బందిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. పెట్రోల్ బంకుల యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజ్ హార్డ్ డిస్క్ కూడా ఎత్తుకెళ్లి పోవడం తో క్లూస్ టీం ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ ఫుటేజ్ ద్వారా సమాచారాన్ని సేకరించారు. దోపిడి దొంగలు మహీంద్ర బొలేరో వాహనంలో వచ్చినట్లు సుమారు ఆరుమంది పైగా ఉన్నట్లు పెట్రోల్ బంక్ సిబ్బంది పేర్కొన్నారు. సిబ్బంది వద్ద ఉన్న క్యాష్ లాక్కొని వారిని రూమ్ లో బంధించి వెళ్లినట్లు తెలుస్తోంది. కాగ అయిజ పోలీస్ స్టేషన్ కూతవేటు దూరంలో ఉన్న పెట్రోల్ బంకు పై దోపిడి దొంగలు రాళ్లతో దాడి చేయడం గమన్హారం. మరోవైపు ఈ దోపిడి జిల్లాలో సంచలనంగా మారింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608